క్లుప్తంగా

ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరుపై హర్షం



యాలాల: తాండూరు నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయడంపై పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సంఘం తరఫున సోమవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని తిమ్మాయిపల్లి శివారులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.

విధుల్లో చేరిన ఎస్‌ఐ గిరి



యాలాల: యాలాల ఎస్‌ఐగా గిరి సోమవారం విధుల్లో చేరారు. ఎస్పీ కార్యాలయానికి అటాచ్ అయిన శంకర్ నుంచి బాధ్యతలను ఆయన తీసుకున్నారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో ఆరునెలల పాటు ప్రొబేషనరీ ఎస్‌ఐగా మండలవాసులతో పరిచయాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ మండల నాయకులు ఎస్‌ఐ గిరిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకెతో సన్మానించారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వెంకటేశ్ చారి



కుల్కచర్ల: చౌడాపూర్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వెంకటేశ్ చారి నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రభులును మోమిన్‌పేట్‌కు బదిలీ చేయగా, డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్ చారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో ముందుకుసాగుతామని అన్నారు. మంగళవారం ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఉదయం 2కె రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలతో స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

దుద్యాల్: ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్ఫూర్తి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ సాయన్న, టైలర్ శారద తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో టైలర్ శారద అవగాహన కల్పిస్తూ గ్రామంలోని 30 మంది ఎస్సీ మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్సీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 70 మంది మహిళలు పేర్లు నమోదు చేసుకుంటే శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



తుంకిమెట్లలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న నర్సింలుగౌడ్

బొంరాస్‌పేట: పేదల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన అందిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింలుగౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తుంకిమెట్ల, బొంరాస్‌పేటలో పలువురికి మంజూరైన సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. తుంకిమెట్లలో బాల్‌రాజ్‌గౌడ్‌కు రూ.32 వేలు, పిట్ల నర్సింలుకు రూ.లక్ష విడుదలైన చెక్కులను బాధితులకు ఇచ్చారు. అలాగే బొంరాస్‌పేట కటికె శేఖర్ కుటుంబానికి మంజూరైన రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బలిజ మల్లేశ్, పార్టీ నాయకులు రాంచంద్రారెడ్డి, నర్సింలునాయుడు తదితరులున్నారు.

నాయకులతో సమావేశం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల జాబితాపై సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ బన్సీలాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల దృష్ట్యా సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

నిప్పు.. దిగుబడికి ముప్పు!

వరి కొయ్యలకు నిప్పంటించడంతో అనర్థాలు
- భూమిలో కలియదున్నడంతో రైతులకు మేలు
- పోషకాల పెరుగుదలకు దోహదం
- వ్యవసాయ అధికారుల సూచనలు



గొడుగోనిపల్లిలో వరి కొయ్యలకు నిప్పంటించిన ఓ రైతు

దోమ: వ్యవసాయంపై ఆధారపడ్డ గ్రామీణ ప్రాంత రైతులు భూమిలో సారం కోల్పోకుండా తగిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు తప్పక పాటించాలి. పంట సిరులను అందించే భూమికి భూసారమే ఆయువు పట్టు. అంతటి ప్రాధాన్యం కలిగిన భూమిని సంరక్షించుకోవడంలో రైతులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. పంట కోతల తర్వాత మిగిలిపోయిన వరి కొయ్యలను రైతులు నిప్పు పెట్టి కాల్చి బుడిద చేయడంతో ఏ మాత్రం ప్రయోజనం ఉండదు. వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో భూమి విపరీతమైన వేడెక్కి భూసారాన్ని కోల్పోవడానికి అవకాశాలు ఉంటాయి. అంతటి ప్రాముఖ్యతను గుర్తించి పొలాల్లో వరి కొయ్యలను కాల్చివేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

దిగుబడిపై ప్రభావం

మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉండగా ఎక్కువ మొత్తంలో ఆయా గ్రామాల రైతులు వరి పంటలను సాగు చేస్తారు. యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎక్కువగా వాటినే వినియోగిస్తున్నారు. వరి పంటలను యంత్రాలతో కోయించడంతో వరి కొయ్యలు పొలంలో పెద్దగా మిగిలి పోతున్నాయి. దీంతో పొలం దున్నే సమయంలో కొయ్యలు నాగళ్లకు అడ్డుగా వస్తాయనే ఉద్దేశంతో నిప్పంటించి కాల్చి వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల భూమిలో విపరీతమైన వేడి పెరిగి భూమి భూసారాన్ని కోల్పోయేలా చేస్తుంది. ఒక హెక్టారు భూమిలోని వరి పైరు అవశేషాలు, వ్యర్థాల(కొయ్య కాళ్లు, వేరు దుబ్బులు)ను తగలబెట్టడం ద్వారా సుమారు రూ.3 నుంచి రూ.4 వేల విలువ గల 30 నుంచి 40 కేజీల నత్రజని, 20 నుంచి 30 కేజీల పాస్పరస్, 40 నుంచి 80 కేజీల పోటాషియం , 4 నుంచి 6 కేజీల గంధకం, 1200 నుంచి 1300 వందల కేజీల సేంద్రియ కర్బన పదార్థాలతో పాటుగా అనేక సూక్ష్మపోషకాలను భూమిలో నష్టపోవాల్సి వస్తుంది.

కలియదున్నితే మేలు

పంటలు సాగు చేస్తున్న రైతులకు సరైనా అవగాహన లేకపోవడంతోనే వరి కొయ్యలకు నిప్పు అంటించి వాటిని కాల్చివేస్తూ భూమికి హాని కల్గిస్తున్నారు. వరి కొయ్యలను పొలంలో కలియదున్నడంతో కలిగే ప్రయోజనాలు రైతులు గమనించలేకపోతున్నారు. కొయ్యలను పొలంలో దున్నడంతో సేంద్రియ ఎరువుగా తయారవుతుంది. దున్నే ముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే రెండు వారాల్లో వరి కొయ్యలు, గడ్డి మొక్కలు త్వరగా కుళ్లిపోతాయి. దీంతో ఎరువుగా తయారవడంతో పోషకాలు పెరిగి రైతులకు పంట దిగుబడి ఎక్కువ వస్తుంది. ఫలితంగా రసాయన ఎరువుల వాడకం తగ్గుముఖం పడుతుంది. నేలలో వరి కొయ్యలను కలియదున్నడంతో ఎకరానికి దాదాపు టన్ను ఎరువు తయారవుతుంది. దీంతో మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది.

దిగుబడి తగ్గుతుంది



యంత్రాలు అందుబాటులోకి వచ్చాక వరి కోతల అనంతరం కొయ్యలకు నిప్పు పెట్టి కాల్చి వేస్తున్నాం. దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేకపోతున్నాయి. కొయ్యలను కాల్చడడంతో భూమిలో భూసారం దెబ్బతింటుందన్న విషయం తమకు అవగాహన లేకపోవడంతోనే నిప్పును అంటిస్తున్నాం.
– నజీరొద్దీన్, రైతు, గొడుగోనిపల్లి

దెబ్బతింటున్న భూసారం



వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలు, సలహాలు ఇస్తే మేలు జరుగుతుంది. అవగాహన లేకపోవడంతో వరి కొయ్యలకు నిప్పంటిస్తున్నారు. దీంతో భూసారం దెబ్బతిని పంటలు ఆశించిన మేరకు దిగుబడులు రాక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి.
– వెంకటయ్య, వ్యకాసం, జిల్లా కార్యవర్గ సభ్యుడు

అవగాహన కల్పిస్తున్నాం



వరి కొయ్యలను కాల్చకూడదని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహనలు కల్పిస్తున్నాం. కొంత మంది రైతులు వరి పంటను కోసిన అనంతరం గడ్డిని, కొయ్యలను తగులబెడుతున్నారు. దీంతో భూమిలో భూసారం దెబ్బతినే అవకాశం ఉంటుంది. భూమిలో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారి పోషకాలను అందిస్తుంది.
– చెన్నయ్య, ఏఈఓ, దాదాపూర్ క్లస్టర్

డేటా ఎంట్రీలో తప్పలుండొద్దు



పూడూరు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



దౌల్తాబాద్‌లో అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

అదనపు కలెక్టర్ సుధీర్

పూడూరు/దౌల్తాబాద్/కుల్కచర్ల/మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన, కుటుంబ సర్వే తుది దశకు చేరుకుంది. కీలకమైన ఆన్‌లైన్ నమోదుకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయాల్లో డేటా ఎంట్రీ చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం పూడూరులో ఆన్‌లైన్ డాటా ఎంట్రీని ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. డాటా ఎంట్రీ చేసే సమయంలో ఎన్యుమరేటర్ తప్పని సరిగా దగ్గర ఉండి వివరాలను నమోదు చేయించాలని అన్నారు. దౌల్తాబాద్‌లో సర్వేలో సేకరించిన సమాచారాన్ని పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ సూచించారు. దౌల్తాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 12,778 కుటుంబాలు సర్వే చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ సబ్‌కలెక్టర్‌కు వివరించారు. 10 మంది ఆపరేటర్లతో ఆన్‌లైన్ నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

- కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ నేతృత్వంలో డేటా ఎంట్రీ చేపట్టారు.
- మోమిన్‌పేట ఎంపీడీఓ విజయలక్ష్మి మండలంలో నిర్వహించిన కులగణన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.
- పూడూరు ఎంపీడీఓ పాండు డాటా ఎంట్రీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

సమగ్ర సర్వేతో ప్రయోజనాలు



వివరాల నమోదును పరిశీలిస్తున్న ఆంజనేయులు

కుల్కచర్ల: సమగ్ర కుటుంబ సర్వేతో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో తమ కుటుంబ వివరాలు తెలియజేసి సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో ఇంకా ఎవరైనా సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకోని పక్షంలో వెంటనే పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్నాల విక్రయానికి అవస్థలు



దుద్యాల్‌లో దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు (ఫైల్)

దుద్యాల్‌లో కరువైన సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రం

దుద్యాల్: ప్రభుత్వం సన్న రకం వడ్లకు బోనస్ ప్రకటించడంతో రైతులు సన్నాలను అధికంగా పండించారు. దీంతో పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా ఒక్క సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. కేవలం దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేసింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న బొంరాస్‌పేట్ మండలానికి వెళ్లాలని వ్యవసాయ, పీఏసీఎస్ అధికారులు చెబుతున్నారు. అధిక భారంతో ఇక్కట్లు పడుతున్నామని కర్షకులు పేర్కొంటున్నారు. వెంటనే సన్నరకం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

ధారూరు: అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీఓ షఫీఉల్లా ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న సప్లిమెంటరీ ఓటరు లిస్టును గ్రామ పంచాయతీల వారీగా తయారు చేశామన్నారు. ఓటర్ల జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

రైతు వేదికలో..

ధారూరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని ధారూరు, గురుదోట్ల వ్యవసాయ విస్తరణ అధికారులు సంతోష్, సంజూరాథోడ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో యాసంగిలో వరి పంటకు బదులు ఇతర పంటల సాగు, వ్యవసాయంలో డ్రోన్ల వాడకంపై సూచనలు ఉంటాయని వారు వివరించారు.

నేడు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పర్యటన

పూడూరు: మండల పరిధిలోని దేవనోనిగూడ, మేడికొండ, కండ్లపల్లి గ్రామాల్లో బీటీ రోడ్లను ప్రారంభించడానికి మంగళవారం ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ తెలిపారు. మధ్యాహ్నం దేవనోనిగూడ, మేడికొండ, కండ్లపల్లి గ్రామాలకు వేసిన బీటీ రోడ్డును ప్రారంభిస్తారని చెప్పారు. మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీనివాస్‌రెడ్డి సీఐ, పరిగి

పరిగి: పరిగి నూతన సీఐగా శ్రీనివాస్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ డీఎస్పీగా పదోన్నతి పొందారు. దీంతో తాండూర్ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రెడ్డి పరిగి నూతన సీఐగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతానన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మొయినాబాద్‌రూరల్: కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో మండల పరిధిలోని కనకమామిడి సంగమేశ్వర దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకాలు, గజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

వికారాబాద్ సందర్శనకు రండి

గవర్నర్‌ను ఆహ్వానించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన స్పీకర్

అనంతగిరి: ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సోమవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. కాగా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కూతురు వివాహానికి వెళ్లిన నేపథ్యంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వికారాబాద్ నియోజకవర్గ విశేషాలను గవర్నర్‌కు వివరించారు. తెలంగాణ ఊటీ అనంతగిరి, మూసీ నది జన్మస్థానం, అనంత పద్మనాభస్వామి దేవాలయాలు తమ నియోజకవర్గంలో ఉన్నాయని, వాటి సందర్శనకు రావాలని గవర్నర్‌ను కోరారు. ఆహ్వానానికి గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు



దుద్యాల్-హకీంపేట్‌లో కొనసాగుతున్న కల్వర్టు పనులు

దుద్యాల్: కొడంగల్ నియోజకవర్గంలో రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నారు. మండల కేంద్రం నుంచి పోలేపల్లి శివారు వరకు వేసే రోడ్డు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వీటిలో భాగంగా కల్వర్టుల నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్డు పనులు గత రెండు నెలల నుంచి కొనసాగుతున్నాయని, త్వరగా పూర్తి చేస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తదని చోదకులు అభిప్రాయపడుతున్నారు.

ఉత్సాహంగా స్వయం పరిపాలన



విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ ఉత్సాహంగా తోటి విద్యార్థులకు బోధన చేశారు. డీఈఓగా శృతి, ఎంఈఓగా శివరాజ్, హెచ్‌ఎంగా ఇసుకుద్దీన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌గా అవంతికలు వ్యవహరించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ ఉషశ్రీ, హస్నాబాద్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సిములు విచ్చేసి ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

పరిగి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ కరీం అన్నారు. సోమవారం మండల పరిధిలోని నస్కల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వారంలో మూడు రోజుల పాటు పాఠశాలలను సందర్శిస్తామన్నారు. మధ్యాహ్న భోజనంపై ఏజెన్సీలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. కూరగాయలను స్వచ్ఛమైన వాటిని వంటలకు వినియోగించాలన్నారు. వంటగదిని ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

అనంతగిరి: రక్తదానం ప్రాణదానంతో సమానమని వికారాబాద్ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణగౌడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం శ్రీ సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని వికారాబాద్‌లో సేవా సంస్థల యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 40 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు బసవేశ్వర్, బందయ్యగౌడ్, సుధీర్ పటేల్, వేణుగోపాల్, శ్రీనాథ్, వసంత్ పాల్గొన్నారు.

క్రీడాకారుల అభ్యున్నతికి కృషి



షాద్‌నగర్: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న క్రీడాకారులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: క్రీడామైదానాలు, క్రీడాకారుల అభ్యున్నతికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని మినీస్టేడియం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించినందుకు సోమవారం క్రీడాకారులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులు ఆయనను కలిసి ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో క్రీడాకారులకు ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వేదికైన క్రీడామైదానాలు, మినీస్టేడియంలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని, సదుపాయాలను క్రీడాకారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని క్రీడల్లో మరింత రాణించాలని సూచించారు. కార్యక్రమంలో చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, ముబారక్, కబీర్ అహ్మద్, మహమూద్, చిన్న, సురేశ్, రమణ, శ్రీపాల్, ప్రభు, మహేందర్, రషీద్, మతిన్, కిరణ్, సతీశ్, రామకృష్ణ, నర్సింహ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ సందర్శన

నందిగామ: అద్దె భవనంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రెవెన్యూ సిబ్బందికి సాధ్యమైనంత త్వరగా సొంత భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని, అందుకు కావాల్సిన స్థలం గుర్తించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని తహసీల్దారు కార్యాలయాన్ని ఎమ్మెల్యే సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సిబ్బందితో ఆయన మాట్లాడారు. నందిగామలో తహసీల్దారు కార్యాలయానికి అనువైన స్థలాన్ని గుర్తించాలని తహసీల్దారు రాజేశ్వర్‌కు సూచించారు. స్థలాన్ని గుర్తించినట్లయితే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి అధికారికంగా స్థలాన్ని తహసీల్దారు కార్యాలయానికి కేటాయించేందుకు కృషి చేస్తానని, వీలైనంత తొందరలో భవన నిర్మాణానికి భూమిపూజ కూడా చేద్దామని అధికారులకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మాజీ ఎంపీటీసీ దేపల్లి కుమార్‌గౌడ్, నాయకులు జిలెల్ల బాల్‌రెడ్డి, లింగం , ఎర్రగారి రమేశ్, రాములు, మహేశ్, జంగయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.